క్లుప్తంగా

'చర్య తీసుకోవాలి'

చిట్యాల: మండలంలోని అందుకుతండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా భవానీ దేవతల విగ్రహాలను అదే గ్రామానికి చెందిన నర్రా అంజిరెడ్డి దంపతులు పొక్లెయినర్ సాయంతో ధ్వంసం చేశారని వారిపై అధికారులు చర్య తీసుకోవాలని సేవాలాల్ సేనా మండల అధ్యక్షుడు బానోత్ రాజునాయక్ కోరారు. బుధవారం గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేవతల విగ్రహాలను తొలగించి లంబాడి కులస్తుల మనోభావాలను దెబ్బతీయడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి కులస్తులు రాజునాయక్, కల్యాణ్‌సింగ్, సమ్మయ్య, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాచార్య జయంతి



మొగుళ్లపల్లి: వీరశైవ పంచార్యుల ప్రథమ గురువైన శ్రీ శ్రీ ఆది జగద్గురు శ్రీ రేణుకాచార్య జయంతి ఉత్సవాలు మొగుళ్లపల్లిలోని ఇంద్రపాల మహాదేవ్ గృహంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జంగమ సమాజ సభ్యులు కర్నే సాంబయ్య, ఇంద్రపాల శంకర్, కాయిగంటి మృత్యుంజయం,దండే సాంబశివుడు, ఇంద్రపాల రమేష్, గురుమూర్తి చంద్రశేఖర్, కాయిగంటి రుద్రదేవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎస్సీకాలనీకి చెందిన ఇందారపు కుమార్ ఇళ్లు మంగళవారం దగ్ధమైంది. దీంతో కుమార్‌కు తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీలో అతడితో కలిసి పని చేస్తున్న తోటి కార్మికులు బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్మికులు తిక్క లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీకి చెందిన కాసిపేట అక్షిత అగ్ని ప్రమాదంలో గాయపడింది. దీంతో బాధిత కుటుంబానికి జయశంకర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం అందజేసినట్లు అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. అక్షయ కాలు శస్త్ర చికిత్స నిమిత్తం సాయం అందించినట్లు పేర్కొన్నారు. తిరుపతి, రాజిరెడ్డి, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో పశువులు అడ్డురావడంతో బైక్‌పై వస్తున్న ఇద్దరు వీఆర్‌ఏలకు బుధవారం గాయాలయ్యాయి. మండల కేంద్రంలో బైక్‌పై వస్తుండగా కాటారం మండలం చింతకానికి చెందిన గడ్డం సంపత్, మేడిపల్లి సమ్మయ్యలకు గాయాలు కాగా, 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లోకి లారీ బుధవారం దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఖాళీ లారీ ఎస్సీ కాలనీలో లేతకరి సుక్కమ్మ అనే మహిళ ఇంట్లోకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తతో అతి వేగంగా డ్రైవింగ్ చేయడంతో లారీ దూసుకుపోయినట్లు సమాచారం. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంటి గోడకూలి ఇంట్లోని వస్తువులు ధ్వంసం అయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. అనంతరం లారీని పొక్లెయినర్ సాయంతో పక్కకు జరిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

భవనం పైనుంచి దూకి మహిళ మృతి

భూపాలపల్లి అర్బన్: మతి స్థిమిత్తం లేని మహిళ భవనం పైనుంచి దూకి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మిలినీయం క్వార్టర్స్‌లో నివాసముంటున్న బోగ లీలావతి క్వార్టర్స్‌లో మొదటి అంతస్తు నుంచి పడిపోగా ఆస్పత్రికి తరలించే క్రమంలోనే చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం దందా!

- జేబులు నింపుకుంటున్న దళారులు
- మామూళ్ల మత్తులో అధికారులు



మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగులు చేసి పలు చోట్ల నిల్వ ఉంచి మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు ఎక్కువ ధరకు అమ్ముకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడో ఒక చోట బియ్యం రవాణా పట్టుబడగా పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టడంతో అక్రమ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలంలోని ఆకినపల్లి, పిడిసిల్ల, ఇస్సిపేట, పర్లపల్లి, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో నిల్వలు ఏర్పాటు చేసుకోని రాత్రి సమయాల్లో వేరే గ్రామాలకు తరలిస్తున్నారు. సోదాలను నిర్వహించి పలువురిపై కేసులు పెట్టినా పూర్తిస్థాయిలో అక్రమ దందాపై దృష్టి సారించకపోవంతో అధికారులకు, అక్రమార్కులకు మధ్య లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. బియ్యం దందా చేస్తున్న అక్రమార్కులు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు ముడుపులు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న స మయంలో అధికారులకు ముందస్తు సమాచారం ఇ స్తూనే ముడుపులు అందించి పక్క రాష్ట్రాలకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో మ ండలంలోని కొంత మంది రేషన్‌డీలర్లు కూడా ఉన్న ట్లు సమాచారం. ఇదంతా అధికారుల అండదండలతో నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

బియ్యం దందాను అరికట్టాలి



అధికారులు, రేషన్‌డీలర్ల అండదండాలతోనే మండలంలో అక్రమంగా రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. అధికారులు స్పందించి బియ్యం దందాను అరికట్టాలి.

– వెంకటేశ్వర్లు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు

వర్గీకరణ చేసే వరకు దీక్షలు కొనసాగిస్తాం..



భూపాలపల్లి రూరల్: దీక్షలో పాల్గొన్న నాయకులు



కాళేశ్వరం: మద్దతు తెలుపుతున్న బీసీ నాయకులు

భూపాలపల్లి రూరల్/కాళేశ్వరం/టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణ చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, జిల్లా నాయకుడు నోముల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలో, టేకుమట్ల , మహదేవపూర్ మండల కేంద్రాల్లో చేపట్టిన నిరసన దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు, 32 లక్షలకు పైగా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన దీక్షకు బీసీ సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, నెరుపటి అశోక్, మంద తిరుపతిమాదిగ, టేకుమట్లలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్, నాయకులు చందర్, అనిల్ కుమార్, మచ్చ శ్రీకాంత్, పైడి, సర్వోత్తమ్, మహదేవపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు బెల్లంపల్లి మల్లేష్, చింతకుంట్ల సదానందం, కొలుగూరి శ్రీకాంత్, లింగాల సుశాంత్, చింతకుంట్ల సాయి ఉన్నారు.



టేకుమట్లలో..

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర కనుకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ బుధవారం పరామర్శించారు. న్యాయవాదులు వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్, సత్యనారాయణ, గునిగంటి శ్రీనివాస్, సురేందర్, రమేశ్, మణికంఠ, యాదగిరి ఉన్నారు.

15 శాతం నిధులు కేటాయించాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ పట్టణ సహాయ కార్యదర్శి గొనేల సాయితేజ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకోస్తామని, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తున్నట్లు ఆరోపించారు. అధిక నిధులు కేటాయించి రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యారంగ సంస్థలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

కోర్టు తీర్పుపై హర్షం

మొగుళ్లపల్లి: నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంచే విధంగా ఉందని ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కులాంతర వివాహాలు చేసుకున్న యువకులను అత్యంత దారుణంగా హత్యలు చేయడం సరికాదన్నారు. విదేశీయులను వివాహం చేసుకోవడం ఆహ్వానించిన మన సమాజం మన దేశంలో ఉన్న కులవ్యవస్థని ఇంకా మార్చుకోకపోవడం మానవత్వం లేని క్రూరత్వమన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ కోర్టు ఇచ్చిన తీర్పు చాలా హర్షించదగిన విషయం అని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- వైద్యుడు ప్రణీత్‌కుమార్

ఏటూరునాగారం: వేసవి కాలంలో ప్రజలు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని కొండాయి ఆస్పత్రి వైద్యుడు ప్రణీత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలం పరిధిలోని కొండాయి, గొత్తికోయగూడెంల్లో వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా ముందస్తుగా ఎండ కాకముందే పనులు ముగించుకోవాలన్నారు. మజ్జిగా, కొబ్బరిబొండాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. అలాగే గొత్తికోయగూడెంలో ఉన్న గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం సమ్మక్క, ఆశకార్యకర్తలు లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు ప్రణీత్‌కుమార్

జేఏసీ కన్వీనర్‌గా సదానందం



కాటారం: ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ మంథని నియోజకవర్గ కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బొడ్డు సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ నత్తి కొర్నెల్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు సదానందం కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే విధంగా జేఏసీ ఉద్యమాలతో ముందుకెళ్తామని పేర్కొన్నారు.

పస్రాలో బస్‌షెల్టర్ నిర్మించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిట్టిబాబు

గోవిందరావుపేట: పస్రా గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పోదిళ్ల చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని పస్రా గ్రామంలో బుధవారం సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పస్రా గ్రామం 50 గ్రామాలకు కేంద్రంగా ఉంటుందని, మారుమూల గ్రామాల ప్రజలకు బస్‌షెల్టర్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రయాణికులు ఎండకు, వానకు రోడ్డుపై గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క చొరవ తీసుకోని బస్‌షెల్టర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు తీగల ఆదిరెడ్డి, కడారి నాగరాజు, అంబాల మురళి, సూర్యనారాయణ, అరుణ్, జీవన్, కవిత, రాజేశ్వరీ, రమేశ్, సువర్ణ, శ్రీనివాస్, సుష్మ, స్రవంతి, అచ్చమ్మ, కైక, ఉదయ్, ప్రేమ్, ప్రభాకర్, మొగిళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ములుగు రూరల్ : మండలంలోని కాశిందేవిపేట గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ఆదేశాల మేరకు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని రోడ్లు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అహ్మద్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ ముసక రమేష్, అజ్జు, గ్రామకమిటీ అధ్యక్షుడు ప్రదీప్, సంపత్ రావు, ఐలుమల్లు, చంద్రమౌళి, ఐలయ్య, సుధాకర్, రవి, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చాంద్‌పాషా

బాధితులకు అండగా భరోసా కేంద్రం

ములుగు: మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం బాధితులకు అండగా ఉంటుందని భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్సై శ్రవంతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం తరుపున మానసిక చికిత్స, కౌన్సిలింగ్, మెడికల్, లీగల్, ప్రాసిక్యూషన్ సేవలను అందిస్తున్నామన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎదుర్కొంటున్న పలు వేధింపులకు సాయం అందించడమే లక్ష్యంగా వన్‌స్టాప్ సొల్యూషన్‌గా పనిచేస్తున్నాయని అన్నారు. భరోసా సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ హోం విజిట్స్ చేస్తుందని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఎల్‌ఓసీ ఇస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గోపగాని వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆస్పత్రి, సెక్రటేరియట్ అధికారులతో మాట్లాడి గంటల వ్యవధిలోనే రూ.1,30,000ల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం సాయంత్రం సెక్రటేరియట్‌లో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన వైద్య సాయం అందించేందుకు ఎల్‌ఓసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- డీఎల్పీఓ వీరభద్రం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్పీఓ వీరభద్రం

రేగొండ: కోటంచ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని డీఎల్పీఓ వీరభద్రం అధికారులకు సూచించారు. మండలంలోని కోటంచలో జాతర కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. జాతరకు వచ్చే దారిలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, పొదలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జాతర పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అమూల్య, జీవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం'

టేకుమట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచుల హక్కులను కాలరాస్తుందని సోమనపల్లి మాజీ సర్పంచ్ మహేశ్ అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైతున్న నేపథ్యంలో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టు చేసిన వారిలో ఏంపెడు మాజీ సర్పంచ్ కోలిపాక రాజయ్య, దుబ్యాల మాజీ సర్పంచ్ బిలకంటి ఉమేందర్రావు ఉన్నారు.



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

డేంజర్ జోన్ ఇళ్ల వివరాలు సేకరించాలి

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల డేంజర్ జోన్‌లో ఉన్న పెద్దతాడిచర్ల డేంజర్ నివాస గృహాలను సేకరించేందుకు వివరాలు తీసుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిరణ్ మాట్లాడారు. ఓసీపీ వెదజల్లే దుమ్ము ధూళి, కాలుష్యం కారణంగా అనేక మంది నిర్వాసితులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డేంజర్ జోన్ గృహాల సేకరణకు చర్యలు తీసుకోని నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఏఎమ్మార్ కంపెనీ సీఎస్ఆర్ నిధులపై విచారణ చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కో కన్వీనర్ దుబాసి పార్వతి, దారకొండ శంకర్, మినుగు నగేష్, రాగం విజయ్ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వైద్య, ఆరోగ్య సిబ్బంది బుధవారం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో సిబ్బంది మిర్చి తోటల్లోకి, కల్లాల్లోకి వెళ్లి స్థానిక, వలస కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వేసవిలో ఎండబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, తిరుపతి, శ్రీను ఆశ కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కాటారం: ఉపాధ్యాయులతో విద్యార్థులు



మొగుళ్లపల్లి: ముల్కలపల్లిలో..

కాటారం: మహాముత్తారం మండలం కొర్లకుంట ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు శిరీష మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ కృష్ణమోహన్, మీన సతీశ్‌కుమార్, సమ్మయ్య, మౌనిక, స్వాతి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు సాదు శ్రీమంజరి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. డీఈఓగా గాదం వివేక్, ఎంఈఓగా ఇరుప రోహన్, ప్రధానోపాధ్యాయుడిగా ఐశ్వర్‌సాయి, ఉపాధ్యాయులుగా గాదం అభినవ్, అక్షయ, శ్రీనిధి వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పసునూటి రాము, ఎలకంటి శ్రీమతి, అనుసమ్మ, మీనా, సృజన పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆదర్శ గ్రామమైన రాచపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం మండల ప్రత్యేక అధికారి అప్పల నాయుడు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాల, చిరుతపల్లి-1 బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ హనుమంతరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.